శ్రీకాకుళం



# అమ్మోరిపోతు

ప్రతి మనిషినీ ఏదో ఓ భయం వెంటాడుతూనే ఉంటుంది. కొన్ని భయాలు మనిషిని కంపరం పుట్టించేలా చేస్తే, మరి కొన్ని భయాలు గుండెల్ని నలిపేస్తూ లోలోపలే కాల్చుకు తినేస్తాయి.

నాకు పండుగొస్తుందంటే చచ్చేటంత భయం. కారణం పండు గనగానే ఎన్నో ఇబ్బందుల నెదుర్కొనడానికి సిద్ధమవటమే! డబ్బు మూలుగుతున్న వాడికి పండుగ వస్తుందంటే ఉబ్బిపోయే టంత సంబరమే కావచ్చుకాని – నా లాంటి మధ్య తరగతి కుటుంబీకుడికి మాత్రం దిక్కుమాలిన భయం పట్టుకుంటుంది.

పండగొస్తే అల్లుడొస్తాడు. వచ్చే ముందు ఫలానాది కావాలంటాడు. ఇవ్వటానికి కుదరకపోతే పేచీకి దిగుతాడు. పెళ్ళాన్ని రాచిరంపాన పెడ్తాడు. తల్లిలేని నా కూతురి కళ్ళల్లో కన్నీళ్లు చూడ్డానికి సహించని నా పితృహృదయం అల్లుడు అడిగిన మేరా సర్దుబాటు చేయాల్సిందే.

ఎన్నో దండుగలు పండుగొస్తే!

సంక్రాంతి ఎన్నో రోజులు లేదు. మా వాళ్ళందరి బట్టలూ తక్కువ రకం అయినా ఫర్వాలేదు కాని అల్లుడికి మాత్రం ఖరీదైనవే తీయాలి.

ఓ సారి పండుక్కి కాబోలు -అల్లుడికి విమల్‌వి తీశాను. కానీ తనవి విమల్‌వి కావని, నా కొడుకు సునీల్‌కు తీసిన మామూలు రకమే అయినా కొడుకుకే మంచివి తీసి, తనకి అంతకంటే నాసిరకం అంటగట్టి అవమానపరిచారని, ఆ రోజంతా నానా గొడవ చేశాడు. ఎంతో శాంతపరిచాం. కాని, వినకుండా వీధిలోకి వెళ్ళి పూటుగా తాగి ఆ అర్ధరాత్రి మాలతిని చితక్కొట్టాడు.

గతంలో పండుగ లెలా గడిచిందీ తలుచుకుంటే గుండె బితుకు బితుకుమంటుంది.

ఈ సంక్రాంతికి కూడా మాలతిని, అల్లుణ్ణీ రమ్మని రాశాను. దానికి జవాబుగా తనకి టూ-ఇన్-వన్ ఇచ్చేట్లయితేనే వస్తానని కరాఖండీగా రాశాడు.

ఆ ఉత్తరంలో ఆప్యాయత శూన్యమై అధికారం ప్రస్ఫుటించింది.

అయితే మాలతి నెక్కడ వీడిస్తాడోనన్న భయం కొద్దీ కొనాలనే నిశ్చ యించుకున్నాను.

సంక్రాంతి వచ్చింది. అల్లుడొచ్చాడు. నా గుండె దడ మొదలైంది.

అతను కోరిన ప్రకారం టు-ఇన్-వన్ చేతిలో పెట్టాను. "ఫిలిప్సో, శాన్యోవో కొంటారను కున్నాను. ఢిల్లీ సెట్‌నా కొనేది? గడ్డితినే మనుషులు!" రెచ్చిపోయి విసిరి కొట్టాడు.

పెద్ద శబ్దం చేస్తూ ముక్కలై పోయింది. మా పెద్దాడు అది చూసి సహించలేక "బావా! కలిగి నంతలో నీ కోరికలు తీరుస్తూరాబట్టే మేం నీకు అలుసై పోయాం. నీకక్కర్లేక పోతే తీసుకోవటం మానేయాలి. కాని ఇలా బంగారంలాంటి టేప్‌రికార్డర్‌ని పగలగొడ్తావా?" అని ఇంకా ఏదో అనబోతూంటే మాలతి గుంజాటన నేను చూడలేక వాడిని తగ్గించి లోనికి పంపేసాను.

ఉత్సాహం పొంగి పొరాలాల్సిన పండుగ నీరసించిన దినమైంది. ఆరోజు సాయంత్రమే చిన్నాడు విశాఖపట్నం నుంచి సెలవులకి వస్తూ పోర్టబుల్ టీ.వీ. తెచ్చాడు. చెప్పా పెట్టకుండా కొనుక్కు రావటం నన్ను నిర్ఘాంత పరిచింది.

'నాకు' అరియర్స్ వచ్చాయి. అడిగితే దెబ్బలాడతారని చెప్పలేదు." అడిగితే చెప్పాడు.

టీ.వీ. అమర్చే సరికి రాత్రి తొమ్మిదైంది. అల్లుడు అన్య మనస్కుడవటం నా దృష్టిని దాటి పోలేదు.

"నాన్నా! నిన్ను బాధ పెడుతున్నాననుకోకు. చిన్నన్నయ్య కొన్న పోర్టబుల్ టీ.వీ. తనకివ్వాలంట. లేకుంటే శాశ్వతంగా నన్నిక్కడ వదిలి మరొక దాన్ని.." వేదన నిండిన గొంతు మరి పెగల లేదు మాలతికి.

అందం లేని మాలతిని తను కట్టుకోవటమే గొప్పతన మంటాడు. కానీ ఆ గొప్పతనానికి ఇరవై వేలు ఖరీదు కట్టాడు. ఏమైనా అంటే అంత ఎత్తున లేచి ఉన్నపళంగా సూట్ కేసు సర్దుకుంటాడు.

మాలతి మనసులో చిచ్చు ఆర్పడానికి చిన్నాడికి విషయం వివరించాను. కస్సుమన్నాడు. వాడిని ఒప్పించేసరికి నరకం కనిపించింది నాకు.

యాంటెన్నాతో పాటు అన్నీ సర్దిపెట్టి అల్లుడికి కృష్ణార్పణం చేశాం. ఏమీ చెప్పలేని మూగవాడిని అయ్యాను నేను.

పండుగ మర్నాడు అల్లుణ్ణీ, మాలతినీ రైలెక్కించి ఇంటికి చేరేసరికి మా ఊరి రైతు అప్పయ్య నాకోసం చూస్తున్నాడు.

అదీ ఇదీ మాట్లాడాక అన్నాడు. "బాబూ అమ్మోరి పండుగొత్తాదంటే బయ్యం ఒట్టుకున్నాదయ్యా! అమ్మోరికో పోతును మేపుతున్నారు. అది దానిట్టం వచ్చినట్లు - పెతీ పొలంలో పడి మేసేత్తున్నాదయ్యా! దాన్ని ఏమనలేం. అనలేం కాదు బాబు! అనకూడదు. అపసారంటా. అది ఏ పొలంలో పడ్డా, ఏది పాడు సేసినా ఒల్లక నోర్మూసుకోటం తప్ప ఏం సెయ్య లేకుండా వున్నాం. ఈ పండుగెప్పుడెల్తాదో ఏటో..."

ఆ మాటలు విన్నాక అల్లుడికీ - అమ్మోరి పోతుకీ తేడా లేదనిపించింది నాకు.

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 4-5-1988)